క్లుప్తంగా

హోంగార్డుతో హెడ్ కానిస్టేబుల్ అసభ్య ప్రవర్తన

రాజమహేంద్రవరం రూరల్: మహిళా హోంగార్డుతో హెడ్ కానిస్టేబుల్ అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటన ఈ నెల 8వ తేదీ రాత్రి బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ నాగేంద్ర ప్రసాద్ ఈ నెల 8వ తేదీ రాత్రి నైట్ రౌండ్స్ విధులు నిర్వహించారు. విధులు ముగించుకుని అర్ధరాత్రి 2 గంటల సమయంలో బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న మహిళా హోంగార్డు చేయి పట్టుకుని నాగేంద్ర ప్రసాద్ అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ నేపథ్యంలో మహిళా హోంగార్డు జిల్లా ఎస్పీ, ఇతర పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బొమ్మూరు ఎస్సై రమేష్ బుధవారం రాత్రి కేసు నమోదు చేయగా, ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం హెడ్‌కానిస్టేబుల్‌ను క్రమశిక్షణ చర్యలు నిమిత్తం వీఆర్‌కు పంపినట్లు తెలిసింది.

14న ఉద్యోగుల మహాసభ


విల్సన్ పాల్

కడియం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం రాజమహేంద్రవరంలో జరగనున్న ఉద్యోగుల మహాసభను జయప్రదం చేయాలని ఆ సభ కన్వీనర్ సీహెచ్‌ఎస్ విల్సన్ పాల్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. జేకే గార్డెన్స్‌లో జరిగే ఈ సభకు రాష్ట్ర స్థాయి ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు తరలిరావాలన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరించడమే లక్ష్యంగా కార్యాచరణ ఉంటుందన్నారు.

వాటర్ బాటిళ్ల లోడు లారీ బోల్తా


బోల్తా పడిన లారీ

కడియం: మండలంలోని పొట్టిలంక వద్ద జాతీయ రహదారిపైకి వెళ్లే లింక్ రోడ్డులో వాటర్ బాటిళ్ల లోడుతో వెళుతున్న లారీ బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లింకురోడ్డు మీదుగా వెళుతున్న లారీ హఠాత్తుగా అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న నర్సరీలోకి బోల్తా పడింది. లారీ డ్రైవర్ అస్వస్థతకు గురి కావడంతో వాహనాన్ని కంట్రోల్ చేయలేకపోయాడని, దీంతో ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. కాగా అదృష్టవశాత్తూ ప్రమాద సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందంటున్నారు. డ్రైవర్‌ను ఆసుపత్రికి తరలించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా.. లారీ కింద పడి నర్సరీలో మొక్కలు దెబ్బతిన్నాయి.

సంపద కేంద్రంలో ఆకుకూరల సాగు


సంపద కేంద్రంలో ఆకుకూరలకు నీరు పెడుతున్న సర్పంచ్ సతీష్‌చంద్ర స్టాలిన్

కడియం: జేగురుపాడు గ్రామ పంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో గల ఖాళీ స్థలంలో ఆకుకూరలను సాగు చేస్తున్నారు. ఆ గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ స్వీయ పర్యవేక్షణలో గోంగూర, తోటకూర, పాలకూర, కొత్తిమీర తదితర వాటిని సేంద్రీయ విధానంలో సాగు చేస్తున్నారు. ఇందుకోసం సంపద కేంద్రం నుంచి ఉత్పత్తయ్యే ఎరువులనే వినియోగిస్తుండడం గమనార్హం. జిల్లా సేంద్రియ వ్యవసాయ శాఖ సిబ్బంది నేతృత్వంలో సహజ విధానంలో సాగు చేయడంపై అవగాహన కూడా కల్పిస్తున్నారు. ఇటీవల గ్రామాన్ని సందర్శించిన ట్రైనీ కలెక్టర్ల బృందం కూడా ఈ మడులను పరిశీలించి సర్పంచ్ స్టాలిన్, సిబ్బంది కృషిని అభినందించింది.

15 గ్రాముల బంగారం చోరీ

కంబాలచెరువు: లలితా నగర్‌లోని ఓ ఇంటిలో 15 గ్రాముల బంగారం చోరీకి గురైన సంఘటనపై త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. కేతా కిరణ్ కుమార్ ఉదయం పని నిమిత్తం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాడు. తిరిగి మధ్యాహ్నం వచ్చి చూసే సరికి ఇంటి వెనుక తలుపులు తెరచి ఉన్నాయి. కంగారుగా లోపలకు వెళ్లి పరిశీలించగా, బీరువాలోని 15 గ్రాముల బంగారం కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పరీక్షా సమయం

- ఉత్సాహంగా 'సాంప్'
- 19 వరకూ నిర్వహణ


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కంబాలచెరువు: సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్ (సాంప్) పరీక్షలు రాజమహేంద్రవరం డివిజన్‌లో ప్రశాంతంగా జరుగుతున్నాయి. గతంలో సమ్మేటివ్ 1, 2 అని పిలిచే ఈ పరీక్షలకు ఈ ఏడాది పేరు మార్చారు. ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకూ చదివే విద్యార్థులకు ఈ వార్షిక పరీక్షలు నిర్వహిస్తున్నారు. బుధవారం నుంచి ఈ పరీక్షలు ప్రారంభమయ్యాయి.

తరగతుల వారీగా..

ఒకటి నుంచి ఐదు, ఆరు, ఎనిమిది, పది తరగతుల విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.15 వరకూ, అలాగే 7, 9 తరగతుల వారికి మధ్యాహ్నం 1.15 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ పరీక్షలు నిర్వహిస్తున్నారు. నగరంలోని 84 ప్రభుత్వ స్కూళ్లు, 124 ప్రైవేట్ స్కూళ్లలో ప్రశాంతంగా జరుగుతున్నాయి.

బైలింగ్వల్ విధానం

పరీక్షల ప్రశ్నాపత్రాలను జిల్లా పరీక్షల నిర్వహణ సంస్థ నుంచి మండల కేంద్రాల్లోని స్టాక్ పాయింట్లకు ఇస్తుండగా, ప్రభుత్వ పాఠశాలకు నేరుగా వాటిని అందిస్తున్నారు. అయితే ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించి, వాటి యాజమాన్యాలే వెళ్లి తెచ్చుకోవాలి. ఇప్పటి వరకూ ఇంగ్లిష్, తెలుగు మీడియంలకు సంబంధించి ఎవరి పేపరు వారికే ఇచ్చేవారు. ఇప్పుడు బైలింగ్వల్ (ద్విభాష) విధానంలో పరీక్ష నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పాఠ్య పుస్తకాలను కూడా బైలింగ్వల్ పద్ధతిలో ముద్రించిన విషయం తెలిసిందే.

25లోపు మూల్యాంకనం

గతేడాది ఓఎంఆర్ విధానంలో సమ్మేటివ్ పరీక్షలు జరిగాయి. ప్రశ్నాపత్రాలను, ఓఎంఆర్ షీట్లను పాఠశాలల వారీగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఎంఈఓలు అందజేసేవారు. పరీక్ష ప్రారంభం రోజున స్ట్రాంగ్ రూములోని ప్రశ్నాపత్రాలను ఆ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందించేవారు. అయితే ఈ ఏడాది అటువంటి విధానాలు లేకుండా ఓఎంఆర్ విధానంలో కాకుండా నేరుగా ప్రశ్నాపత్రాలను విద్యార్థులకు అందజేశారు. కాగా.. 19వ తేదీతో పరీక్షలు ముగుస్తాయి. విద్యార్థుల పేపర్లను ఈ నెల 25వ తేదీలోగా మూల్యాంకనం పూర్తి చేసి ఆన్‌లైన్‌లో ఎంటర్ చేయాలి. అనంతరం సాంప్ పరీక్షల్లో విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి వివరించాలి. వారి సమక్షంలో ప్రోగ్రెస్ కార్డులు అందించాలి.

ప్రశాంతంగా పరీక్షలు



సమ్మేటివ్ 1 పరీక్ష పేరు ఇప్పుడు సాంప్‌గా మారింది. నగరంలోని అన్ని స్కూళ్లలో పరీక్షలు జరుగుతున్నాయి. వీటిని సజావుగా నిర్వహించేలా ఏర్పాట్లు చేశాం. పరీక్షల నిర్వహణపై ప్రధానోపాధ్యాయులకు సూచనలు, సలహాలు ఇచ్చాం. టైమ్ టేబుల్ ప్రకారం పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నాం.

– బి.దిలీప్ కుమార్, అర్బన్ డీఐ, రాజమహేంద్రవరం

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కంబాలచెరువు: స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు నిబంధనలను పాటించాలని, నియమాలు ఉల్లంఘించి లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. డిప్యూటీ మాస్ మీడియా అధికారి ఎస్ఆర్‌పీఎస్ సత్యకుమార్, టీం సభ్యులతో కలసి గురువారం నగరంలోని ఆర్ఆర్, జూపిటర్, సుధా స్కానింగ్ సెంటర్లు, లూసిడ్ మెడికల్ డయాగ్నోస్టిక్స్‌ను తనిఖీ చేశారు. స్కానింగ్ సెంటర్ల రికార్డులు, నివేదికలు, ఫారం ఎఫ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గర్భస్థ లింగనిర్ధారణ చట్టం నిబంధనలను స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాలన్నారు. కచ్చితంగా ధరల పట్టికలను ప్రదర్శించాలన్నారు. స్కానింగ్ చేసిన ప్రతి గర్భిణి వివరాలను సంబంధిత ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు పీసీపీఎన్‌డీటీ చట్టంపై అవగాహన కల్పించారు. ఆయన వెంట ఎంపీహెచ్‌వో వెంకటరమణ, ఎంపీహెచ్‌ఎస్ శ్రీనివాస్, ప్రసాద్ ఉన్నారు.

మజ్దూర్ యూనియన్ నాయకుల సంబరాలు


సంబరాలు చేసుకుంటున్న మజ్దూర్ యూనియన్ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ విజయం సాధించడంపై గురువారం రాజమహేంద్రవరంలో విజయోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డివిజన్ సెక్రటరీ విజయ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 4, 5, 6 తేదీల్లో ఈ ఎన్నికలు జరిగాయన్నారు. ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా 1960, 1968, 1974 సమ్మెల ద్వారా రైల్వే కార్మికులకు డీఏ, 8 గంటల పనివిధానం, బోనస్, ఇప్పుడు ఎన్‌పీఎస్‌కు బదులు యూపీఎస్ సాధించామన్నారు. కార్మికులకు న్యాయంగా ఇవ్వాల్సిన ఓపీఎస్, 8వ వేతన సంఘం ఏర్పాటు, కేంద్ర ప్రభుత్వం బకాయి పడిన 18 నెలల డీఏ ఏరియర్స్, సేఫ్టీ క్యాడర్, అందరికీ రిస్క్ అలవెన్స్ కోసం పోరాటం చేసి సాధిస్తామన్నారు. కార్యక్రమంలో ఓపెన్ లైన్ సెక్రటరీ డి.శ్రీనివాసరెడ్డి, లోకో రన్నింగ్ బ్రాంచ్ సెక్రటరీ తిరుమల దేవ్, ఇంజినీరింగ్ మెకానికల్ బ్రాంచ్ సెక్రటరీ జగన్నాథరావు, బ్రాంచ్ చైర్మన్లు జయరాం తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో జాతీయ వర్క్‌షాప్

కంబాలచెరువు: ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో గురువారం మేధో సంపత్తి హక్కులు, పేటెంట్లు, డిజైన్ ఫైలింగ్ అనే అంశంపై ఆన్‌లైన్ వర్క్‌షాప్ జరిగింది. కాలేజీ వాణిజ్య నిర్వహణ శాస్త్ర విభాగం, రాజీవ్ గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ మేనేజిమెంట్, నాగ్‌పూర్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ పేటెంట్స్ అండ్ డిజైన్స్‌కు చెందిన డాక్టర్ భరత్ ఎస్.సూర్యవన్షి ఉపన్యాసకుడిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ మేధో సంపత్తి హక్కుల ప్రాముఖ్యతను వివరించారు. కో ఆర్డినేటర్ డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ మేధో సంపత్తి హక్కుల మీద అవగాహన అందరికీ ఎంతో అవసరమన్నారు. ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ అన్నపూర్ణ వాణిజ్య, నిర్వహణ శాఖ నివేదికను సమర్పించారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ కన్వీనర్ రమేష్ కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీలు భవానీ శంకర్ రెడ్డి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి


సదస్సులో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ గణేష్, చిత్రంలో ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: సైబర్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ధవళేశ్వరం ఇన్‌స్పెక్టర్ గణేష్ అన్నారు. బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు అధ్యక్షతన గురువారం సదస్సు నిర్వహించారు. ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆదేశాల మేరకు సౌత్‌జోన్ డీఎస్పీ భవ్య కిషోర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని యువతను హెచ్చరించారు. విచ్చలవిడిగా బైక్ డ్రైవింగ్ చేయరాదని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. బాలికలు, మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైం టీమ్ సభ్యులు వివిధ వీడియోలను ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ పోలీసు అధికారులు చెప్పిన విషయాలను విద్యార్థులు అవగాహన చేసుకుని సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు. ఎస్సైలు క్రాంతికుమార్, హరిబాబు, ఏఎస్సై సుధాకర్, బ్లూకోట్స్ హెడ్ కానిస్టేబుల్ మూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి


సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి

రాజమహేంద్రవరం రూరల్: రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. కాతేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం జరిగిన కాతేరు, వెంకట నగరం గ్రామాల రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్థాయిలో భూసమస్యలను పరిష్కరించడానికే రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి 13 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ జయసూర్యకుమార్ తెలిపారు. డిప్యూటీ కలెక్టర్ వేదవల్లి, మండల ప్రత్యేకాధికారి కేఎస్ జ్యోతి, మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, గంగిన హనుమంతరావు, నున్నకృష్ణ, తహసీల్దార్ కుమార్ బాబు, బిక్కిన సాంబశివరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి జాతీయ పురస్కారం


పురస్కారం అందుకుంటున్న సువర్ణవేణి

కడియం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్) డాక్టర్ బూసి సువర్ణవేణికి గద్దర్ జాతీయ సేవా పురస్కారం లభించింది. పి.గన్నవరంలోని సాయితేజ జూనియర్ కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆమెకు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీ దేవి, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి డాక్టర్ వెన్నెల గద్దర్ పురస్కారం అందజేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు.

- ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కోలమూరు, రాయుడు పాకలు, పరిమి నగర్, ఎన్వీఆర్ లేఅవుట్, కంటిపూడి లేఅవుట్, కొంతమూరులోని బొమ్మన కాలనీ, వెంకటేశ్వర ప్లాస్టిక్ ఏరియా, శ్రీరామ్ నగర్, కల్యాణ్ నగర్, ఆదర్శ నగర్, ఎంప్లాయిస్ కాలనీ, జంగాల కాలనీ, బీసీ కాలనీ, శేషాద్రి లే అవుట్, వీవీ కొండయ్య నగర్, క్వారీ ఏరియా, ఫోర్త్ బ్రిడ్జి, నారాయణపురం, పుంత, బాబానగర్, సత్తెమ్మ తల్లి గుడి, నారాయణపురం మసీదు, గోపాలనగర్ పుంత, వెంకట రామయ్య నగర్, వాంబే గృహాల ఏరియాలో విద్యుత్ ఉండదు.
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ హనుమాన్ నగర్, క్యూబటిక్ విల్లాస్, మోరంపూడి మెయిన్ రోడ్డు, బాలకృష్ణ నగర్, అరవింద్ నగర్ ప్రాంతాలలో సరఫరా నిలిచిపోతుంది.

మహిళ అదృశ్యం

కంబాలచెరువు: దానవాయిపేటలో దేవుడమ్మ అనే మహిళ అదృశ్యమైన సంఘటనపై ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. దూరసపాము గ్రామానికి చెందిన దేవుడమ్మను ఆమె తమ్ముడు ఎ.కన్నారావు దానవాయిపేటలోని మానస ఆసుపత్రికి తీసుకువచ్చాడు. ఆ ఆసుపత్రి నుంచి ఆమెకు వైద్య పరీక్షలు చేసేందుకు విజయ ఆసుపత్రికి తీసుకువచ్చి స్కానింగ్ చేయించాడు. ఆ రిపోర్టు కోసం ఆసుపత్రి లోపలకు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి దేవుడమ్మ అక్కడ కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాలన్నీ వెతికాడు. ఆచూకీ లభించకపోవడంతో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

శివకృష్ణకు జ్యోతిష ఆచార్య బిరుదు


శివకృష్ణను సత్కరిస్తున్న ప్రముఖులు

ప్రకాశం నగర్: నగరానికి చెందిన జ్యోతిషుడు శివకృష్ణకు జ్యోతిష ఆచార్య బిరుదు లభించింది. తిరుపతిలోని తిరుమల తిరుపతి దేవస్థానం మహతి ఆడిటోరియంలో ఎస్ఎస్ లైవ్ ఆస్ట్రో అనే అంతర్జాతీయ సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ జ్యోతిష పురస్కారాల ప్రదానోత్సవంలో ప్రముఖ జ్యోతిషులు నరసింహారావు తదితరులు శివకృష్ణను ఆచార్య బిరుదుతో సత్కరించారు.

పట్ట పగలే విద్యుత్ వెలుగులు


పగటి పూట వెలుగుతున్న వీధి లైట్లు

రాజమహేంద్రవరం సిటీ: కార్పొరేషన్ సిబ్బంది పట్టపగలే వీధి దీపాలు వెలిగించి నగరాన్ని కాంతివంతం చేస్తున్నారు. వీధి దీపాలు పగలు కూడా వెలుగుతూ కనిపిస్తున్నాయి. నగరంలో క్వారీ సెంటర్ నుంచి కంబాల చెరువు సమీపంలోని రామకృష్ణ మఠం వరకు సుమారు 200 వీధి దీపాలు గురువారం పట్టపగలే వెలుగుతూ కనిపించాయి. చీకటిగా ఉన్న ప్రాంతాల్లో వీధి లైట్లు వెలిగించడంలో అంతగా శ్రద్ధ పెట్టని నగరపాలక సంస్థ సిబ్బంది, అధికారులకు.. పగటి సమయంలో వెలుగుతున్న దీపాలను ఆర్పి వేయాలన్న ఆలోచన రాకపోవడంపై ప్రజలు బహిరంగంగా విమర్శలు గుప్పిస్తున్నారు.

బాల్య వివాహాలు నిర్మూలించాలి


పెదపూడిలో బాల్య వివాహాల నిర్మూలనపై మాట్లాడుతున్న ఎంఈఓ-2 సత్యనారాయణ

పెదపూడి: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈఓపీఆర్డీ, మండల యాంటీ చైల్డ్ అబ్యూజ్ కమిటీ చైర్మన్ ఎం.సత్యనారాయణరెడ్డి, ఎంఈఓ-2 సీవీవీ సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం యాంటీ చైల్డ్ అబ్యూజ్ వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి కరప, పెదపూడి మండలాల టీచర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వీఓలు హాజరయ్యారు. పడాల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పి.సూర్యప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బాల్య వివాహాలను నిరోధించాలని, బాలల హక్కులు, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ సత్యనారాయణ, వెలుగు ఏపీఎం వి.అరుణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీగౌరీ, కరప మండల ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, ఎంఈఓ బులికృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

తిరువీధి మహోత్సవం


రంగనాథస్వామిని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

సీటీఆర్ఐ: రంగనాథస్వామి, రామానుజాచార్యుల తిరువీధి మహోత్సవాన్ని గురువారం నగరంలో ఘనంగా నిర్వహించారు. తాడి కోదండరామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. గత ఎనిమిదేళ్లుగా దిగ్విజయంగా జరుగుతున్న ఈ ఉత్సవం తొమ్మిదో సంవత్సరంలోకి అడుగుపెట్టింది. దీనిలో భాగంగా రంగనాథస్వామి, రామానుజాచార్యుల విగ్రహాలతో పల్లకీ సేవ స్థానిక సీతమ్మ సందు నుంచి ప్రారంభమై వంకాయలవారి వీధిలోని అష్టలక్ష్మి ఆలయానికి చేరుకుంది. అక్కడ రంగనాథస్వామికి విశేష అర్చనలు జరిపించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేశారు.

కన్నుల పండువగా మదన గోపాలస్వామి కల్యాణం

పెదపూడి: అనపర్తి మండలం పొలమూరు గ్రామంలో ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి వార్షిక దివ్య కల్యాణం బుధవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. గ్రామానికి చెందిన సత్తి సూర్యనారాయణరెడ్డి, వరలక్ష్మి కుటుంబ సభ్యులు కల్యాణ కర్తలుగా కూర్చున్నారు. ముందుగా విశ్వక్సేన ఆరాధన, మండపారాధన, అంకురార్పణ, హోమ కార్యక్రమాలు జరిగాయి. వైఖానస ఆగమ విధానంలో ఆలయ బ్రహ్మ వాడపల్లి వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు పవన్‌కుమార్ ఆచార్యులు, ఆలయ అర్చకులు వంశీకృష్ణ, గౌతమ్.సాకేత్ కల్యాణ క్రతువులు నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణ చేశారు. మాంగల్యధారణ, ముత్యాల తలంబ్రాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో స్వామివారి కల్యాణం కడురమణీయంగా జరిగింది. ఆలయ ఈఓ ఎస్.శ్రీనివాసు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


కల్యాణ వేదికపై రుక్మిణి, సత్యభామ సమేత మదనగోపాలస్వామి


నేటి నుంచి అథ్లెటిక్స్ పోటీలు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో రెండు రోజుల పాటు జరిగే ఇంటర్ కాలేజీయెట్ అథ్లెటిక్స్ (మెన్ అండ్ ఉమెన్) చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఈ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ చూపిన వారి నుంచి యూనివర్సిటీ టీమ్‌ను ఎంపిక చేస్తారు. రన్నింగ్, జంపింగ్, త్రోయింగ్ వంటి మూడు విభాగాలలో 24 ఈవెంట్లు జరుగుతాయి. ఈ పోటీలకు నన్నయ, అనుబంధ కళాశాలల నుంచి 250 మంది క్రీడాకారులు, 30 మంది న్యాయ నిర్ణేతలు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమ షెడ్యూల్‌ను రిజిస్ట్రార్, స్పోర్ట్సు బోర్డు ఇన్‌చార్జి సెక్రటరీ ఆచార్య జి.సుధాకర్ గురువారం విడుదల చేశారు.

ఆర్టీసీ అధికారుల ఫోన్ నంబర్లు

జిల్లా ప్రజారవాణా అధికారి	షర్మిల అశోక	91542 91407
రాజమహేంద్రవరం డీఎం	షేక్ షబ్నం	99592 25535
డిపో అసిస్టెంట్ మేనేజర్	అజయ్‌బాబు	73829 12141
డిపో అసిస్టెంట్ ఇంజనీర్ (గ్యారేజ్)	ఎస్.నాగలక్ష్మి	79890 45549
సీనియర్ మెడికల్ ఆఫీసర్	ప్రసూనాంబ	97014 50208
డిప్యూటీ మెకానికల్ ఇంజినీర్ జోన్-2	రవిశంకర్	99592 25789
డీపీటీవో అకౌంట్స్ ఆఫీసర్	ఆర్‌వీ కోటేశ్వరరావు	99592 25529
అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కార్గో)	కె.మాధవ్	73311 47262
డీపీటీఓ పీఆర్ఓ	బి.శివకుమార్	73829 09283
చీఫ్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్	బి.మోహన్ కుమార్	73829 10603
రిజర్వేషన్ కార్యాలయం ఇన్‌చార్జ్	మహ్మద్ రియాజ్	99592 25561
డీపీటీఓ రీజినల్ కోర్ గ్రూప్ మెంబర్	జి.కృష్ణ	73829 09296
మెకానికల్ అసిస్టెంట్ ఇంజినీర్	జీఎల్ఎన్ మూర్తి	73829 11418
డీపీటీఓ ఆఫీస్ సూపరింటెండెంట్	టి.మల్లేశ్వరరావు	73829 09279
రాజమహేంద్రవరం బస్టాండ్ మేనేజర్	డి.త్రిమూర్తులు	73829 10187
హెవీ డ్రైవింగ్ స్కూల్ ట్రైనర్	వీఎస్ఎల్ రావు	99483 13344

సినిమాలు



శ్యామల :	పుష్ప-2
సూర్యమినీ :	పని
సూర్యప్యాలెస్ :	మిస్‌యూ
స్వామి :	పుష్ప-2
అశోక :	పుష్ప-2
శివజ్యోతి :	పుష్ప-2
అనుశ్రీ :	పుష్ప-2
రాజా :	పుష్ప-2
ఊర్వశి :	మిస్‌యూ
మేనక :	అమరన్
రంభ :	ప్రణయగోదారి, సమిధ
కుమారి :	లక్కీభాస్కర్
అప్సర :	పుష్ప-2
నామవరం	
వీఎస్ మహల్ :	పుష్ప-2
ధవళేశ్వరం	
మురళీకృష్ణ :	పుష్ప-2
కడియం	
వెంకటసూర్య :	పుష్ప-2